# గ్రూప్ -2,3 పై సస్పెన్స్

- స్పష్టతనివ్వని టీఎస్‌పీఎస్సీ
- గ్రూప్ -2లో మరిన్ని కొత్త పోస్టులు
- అనుబంధ నోటిఫికేషన్‌కు చాన్స్
- దీంతో ఆలస్యంకానున్న ప్రక్రియ
- ఖరారు కాని గ్రూప్ -3 పరీక్ష తేదీలు

హైదరబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రూప్ -2, గ్రూప్ -3 పరీక్షలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. దీనిపై టీఎస్‌పీఎస్సీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వడంలేదు. తాజా అంచనా ప్రకారం.. ఇప్పట్లో ఈ రెండు నియామక పరీక్షలను నిర్వహించే అవకాశాలు కనిపించడంలేదు. టీఎస్‌పీఎస్సీ వీటిపై దృష్టిపెట్టకపోవడం, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ పరీక్షలకు ముహూర్తం కుదరడం లేదు. దీంతో గ్రూప్ -2కు మరింత సమయం పట్టవచ్చు. ప్రస్తుత నోటిఫికేషన్‌కు.. మరికొన్ని కొత్త పోస్టులను జతచేయాలని కమిషన్ భావిస్తున్నది. ఇదే నిజమైతే పాత నోటిఫికేషన్‌కు అనుబంధ నోటిఫికేషన్ జారీచేస్తారు. ఇందుకు ప్రభుత్వశాఖల నుంచి ఖాళీల వివరాలు రావాలి. ఖాళీలపై ఆర్థికశాఖ ఆమోదమివ్వాలి. మొత్తం మీద గ్రూప్ -2 పోస్టుల భర్తీకి మరికొంత సమయం పట్టే అవకాశాలున్నాయి. ప్రభుత్వ వర్గాల కథనం ప్రకారం కొన్ని అదనపు పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేయొచ్చు.

### సిబ్బందినివ్వండి : టీఎస్‌పీఎస్సీ

వరుస నోటిఫికేషన్లు, పరీక్షల ఒత్తిడి నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీకి అదనంగా సిబ్బందిని ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఇటీవలే ప్రభుత్వాన్ని కోరారు. తాజా అవసరాల దృష్ట్యా 150 మంది సిబ్బందిని కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించారు. దీంతో 50 మందిని తక్షణమే డిప్యూటేషన్ మీద, మరో 100 మంది ఉద్యోగులను రిక్రూట్‌చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలకు ముందు టీఎస్‌పీఎస్సీలో సిబ్బందిలేరంటూ విమర్శించిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి టీఎస్‌పీఎస్సీ ప్రతిపాదనలను పక్కనపెట్టేశారు. దీంతో ఉన్న సిబ్బందితో నెట్టుకురాలేక కమిషన్ నానా అవస్థలు పడుతున్నది.

### గ్రూప్ -3 ఎప్పుడో..

ఇక గ్రూప్ -3 పరీక్ష పరిస్థితి విచిత్రంగా ఉంది. ఇంత వరకు ఈ పరీక్షను ఎప్పుడు నిర్వహిస్తారన్న అంశంపై కమిషన్ స్పష్టతనివ్వడం లేదు. 2022 డిసెంబర్ 30న 1,363 పోస్టుల భర్తీకి గ్రూప్ -3న నోటిఫికేషన్‌ను జారీచేశారు. ఆ తర్వాత మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో 12 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను చేర్చి అదనపు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పోస్టుల సంఖ్య 1,375కు చేరింది.

# టీజీవో అధ్యక్షుడిగా ఏలూరి

### ప్రధానకార్యదర్శిగా సత్యనారాయణ ఎన్నిక



ఏ శ్రీనివాసరావు



సత్యనారాయణ

హైదరాబాద్/ మన్సూరాబాద్ ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కేంద్రం సంఘం నూతన అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా ఏనుగుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో సంఘం నూతన కార్యవర్గం కొలువుదీరింది. అసోసియేట్ అధ్యక్షుడిగా బీ శ్యామ్, ఉపాధ్యక్షుడిగా ఏ జగన్‌మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఏ పరమేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా ఎం ఉపేందర్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా జీ దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాచర్ల రామకృష్ణాగౌడ్, కార్యనిర్వాహక సభ్యుడిగా పంతంగి యాదగిరిగౌడ్, సలహాదారులుగా టీ రవీందర్‌రావు, జీ పురుషోత్తంరెడ్డి, వాంకు డోత్ సురేశ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎన్ రవి, సీహెచ్ సంపత్‌కుమార్‌లు వ్యహరించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల వేతన సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి న్యాయబద్ధమైన డిమాండ్లను సాధించుకుంటామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను త్వరలో విడుదల చేయించుకోవడంతో పాటు పీఆర్సీ సాధనకై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. జీవో నంబర్ 317 ద్వారా దూర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

### నిరసనల మధ్యే ఎన్నిక

టీజీవో ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ చింతలకుంటలోని ప్రలవిగార్డెన్‌లో తొలుత కాస్త హైడ్రామా నెలకొన్నది. 15 మంది ఇంజినీర్లు పోటీచేసేందుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు వెళ్లారు. దీంతో నిర్ధేశిత సమయం దాటిందన్న కారణంతో వీరి నామినేషన్లను స్వీకరించలేదు. ఏకగ్రీవం చేసేందుకే ఇలా చేస్తున్నారని పలువురు టీజీవో నేతలు ఆందోళనకు దిగారు. అంతా సద్దుమణిగాక ఆ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నేడు ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

- 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 100 శాతం సిలబస్‌కు ప్రశ్నలు
- దరఖాస్తుల్లో ఈడబ్ల్యూఎస్ ఆప్షన్
- ఎప్‌సెట్ కన్వీనర్ డీన్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్) నోటిఫికేషన్ బుధవారం విడుదల చేస్తామని కన్వీనర్ డీన్ కుమార్ తెలిపారు. ఈ నెల 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను బుధవారం వెల్లడిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రొఫెసర్ డీన్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ రెండింటికి రాసే వారు ఒకే సారి దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ సారి ఎప్‌సెట్ పరీక్షను వందశాతం సిలబస్‌కు నిర్వహిస్తున్నామని, ఆయా సిలబస్‌ను బుధవారం విడుదల చేస్తామని చెప్పారు. ఇక విద్యార్థులు ఫీజు చెల్లించాక లావాదేవీ నెంబర్ (ట్రాన్సాక్షన్)ను జాగ్రత్తగా నోట్ చేసుకోవాలని సూచించారు. ఈసారి దరఖాస్తుల్లో ముందుగానే ఈడబ్ల్యూఎస్ ఆప్షన్ ఇస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి ఎప్‌సెట్ వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

**పూర్తి షెడ్యూల్ ఇలా..**

| | |
|---|---|
| ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ | 26-02-2024 |
| దరఖాస్తుకు తుది గడువు | 06-04-2024 |
| ఎడిట్ ఆప్షన్ | 08-04-2024<br>12-04-2024 |
| రూ.250 ఆలస్య రుసుముతో | 09-04-2024 |
| రూ.500 ఆలస్య రుసుముతో | 14-04-2024 |
| రూ.2,500 ఆలస్య రుసుముతో | 19-04-2024 |
| రూ.5,000 ఆలస్య రుసుముతో | 04-05-2024 |
| హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ | 01-05-2024 |
| పరీక్షలు | 09-05-2024<br>12-05-2024 |

### సెషన్‌కు 40వేల మంది అభ్యర్థులు

ఎప్‌సెట్ పరీక్షలను గతానికి భిన్నంగా నాలుగు రోజుల్లోనే పూర్తిచేస్తున్నామని, ఆన్‌లైన్ సెంటర్ల సామర్థ్యాన్ని సెషన్‌కు 4 వేలకు పెంచామని డీన్‌కుమార్ తెలిపారు. గతంలో ఒక సెషన్ సామర్థ్యం 25-30వేలే ఉండగా, 40వేలకు పెంచామని చెప్పారు. ప్రశ్నపత్రాల్లో తప్పులేకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, దరఖాస్తు సమయంలో బ్యాక్, రిఫ్రెష్ వంటి బటన్లను ఎట్టి పరిస్థితుల్లో నొక్కరాదని సూచించారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొన్న సెల్‌నెంబర్, ఈమెయిల్ ఐడీలనే వాడాలి. మధ్యలో మార్చితే ఇబ్బందులొస్తాయని తెలిపారు.

### ఉర్దూ మీడియం వారికి చివరగా పరీక్ష

ఎప్‌సెట్‌ను ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మూడు భాషల్లో నిర్వహిస్తున్నామని డీన్‌కుమార్ తెలిపారు. ఉర్దూ మీడియం వారికి చివరి రోజు మే 12న పరీక్ష ఉంటుందని, వీరికి ఉర్దూ / ఇంగ్లిష్ భాషల్లోనూ పేపర్ ఇస్తామని వివరించారు. మిగతా వారికి తెలుగు, ఇంగ్లిష్ రెండు భాషల్లో ప్రశ్నపత్రాలిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి ఎప్‌సెట్ మెయిల్ ఐడీ లేదా 7416923578, 7416908215 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.



మోతె మండలం బుర్కచర్లలో ఆస్మిత తల్లి జ్యోతిని ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యాయాదవ్

# గురుకులాల్లో ఆత్మహత్యలను నివారించాలి

- విద్యార్థినుల వరుస బలవన్మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి
- ఎంపీ బడుగులతో కలిసి ఆస్మిత తల్లిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

మోతె, ఫిబ్రవరి 20: సంక్షేమ వసతి గృహ విద్యార్థినుల ఆత్మహత్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి గురుకులాల పనితీరును సమీక్షించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం బుర్కచర్లలో ఆస్మిత తల్లి జ్యోతిని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యాయాదవ్‌తో కలిసి మంగళవారం ఆమె పరామర్శించారు. కవిత మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు కలిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమీక్షించి ఆడబిడ్డల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రెండు వారాల క్రితం భువనగిరి గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోగా.. సూర్యాపేట జిల్లా ఇమాంపేట పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు తనువు చాలించడం బాధాకరమని చెప్పారు. విద్యార్థినులు పరీక్షల ఒత్తిడిలో ఉన్నారా? లేక మరేదైనా సమస్యలతో బాధపడుతున్నారా? అనే అంశాలపై ప్రభుత్వం ఆలోచించాలని అభిప్రాయపడ్డారు. ఆడపిల్లలు ఆత్మహత్య చేసుకునేంత స్థాయికి ఎందుకు ఒత్తిడి చేస్తున్నారు? సిలబస్ బాగలేకనా? కౌన్సిలర్ల సంఖ్య తక్కువగా ఉన్నదా? సమయానికి నాణ్యమైన ఆహారం అందుతున్నదా? వంటి అంశాలపై సీఎం సమీక్ష చే యాని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనల్లో దర్యాప్తు ముందుకు సాగడం లేదని, విద్యాశాఖకు మంత్రిని నియమించే దిశగా సీఎం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బాధిత కు టుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్మిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆస్మిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీవోడబ్ల్యూ సంధ్యను హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, కవిత కలిసి పరామర్శించారు. ఇటీవల సంధ్య భర్త మృతిచెందిన విషయం తెలిసిందే.

# 'కోచింగ్' మాఫియా కోసమే గ్రూప్-1

- మొత్తం పోస్టులు మేమే ఇచ్చామని చెప్పకొనేందుకే కొత్త నోటిఫికేషన్
- మళ్లీ కోచింగ్ సెంటర్లకు నిరుద్యోగులు
- జాబ్ క్యాలెండర్ ఏమాయె
- కోదండరాం నోరెందుకు మెదపడం లేదు
- బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా జారీచేసిన గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ వెనక కోచింగ్ సెంటర్ల మాఫియా ఉందని బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. నిరుద్యోగులను మోసం చేసేందుకే ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా నోటిఫికేషన్‌లోని 503 పోస్టులు గత ప్రభుత్వం ఇచ్చినవేనని, వాటికి అదనంగా మరో 60 పోస్టులు మాత్రమే కలిపి ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. గత నోటిఫికేషన్‌ను రద్దు చేయడం ద్వారా మొత్తం పోస్టులను తామే భర్తీ చేశామని చెప్పేందుకే ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ జారీచేసిందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అక్టోబర్ వరకు కొనసాగుతుందని, దీనివల్ల నిరుద్యోగులు తమ విలువైన సమాయాన్ని కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇప్పటి వరకు ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు. రెండు లక్షల ఉద్యోగాల సంగతి ఏమైందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. మంత్రివర్గ సమావేశంలో జాబ్ క్యాలెండర్‌పై కానీ, నోటిఫికేషన్లపై కానీ నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. గ్రూప్-2 కోసం మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వకుండా పాతదానినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొ గతంలో జాబ్ క్యాలెండర్ అన్న కోదండరాం ఇప్పుడు దాని గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. పాత నోటిఫికేషన్ల ద్వారానే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

### మెగా డీఎస్సీ హామీ ఏమాయె

అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ వేస్తామన్న హామీ ఏమైంది. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు వెంటనే పరీక్షలు నిర్వహించాలి. యాదాద్రి, సూర్యాపేటలో నలుగురు గురుకుల విద్యార్థులు చనిపోతే ఒక్క మంత్రి కూడా స్పందించలేదు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ఎక్కడ? ఎమ్మెల్సీ కవిత బాధితుల కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహిస్తే రేవంత్ ప్రభుత్వం నియామకపత్రాలు అందిస్తున్నది.

-బాలు, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు

# ఎస్‌ఎస్‌ఏ వాటా రూ.1,913.93 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరంలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో రూ.1,913.93 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ బడ్జెట్ ఆమోదానికి ఢిల్లీలో ఈనెల 15, 16న జరిగిన ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్ట్ ఆమోదిత మండలి (పీఏబీ) సమావేశం పచ్చజెండా ఊపింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులు ప్రతిపాదనలను రూపొందించి కేంద్రానికి పంపించా రు. ఇందులోభాగంగా కేంద్ర వాటాగా రూ.1,148 .34 కోట్లు, రాష్ట్రవాటాగా రూ. 765.56 కోట్లు ఖర్చుచేయాలని ప్రతిపాదించారు.

# త్వరలో ఈసెట్‌కు కన్వీనర్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్ ల్యాట్రల్ ఎంట్రీ కోసం నిర్వహించే టీఎస్ ఈసెట్‌కు త్వరలో కొత్త కన్వీనర్ రానున్నారు. ఇప్పటివరకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ విధులు నిర్వర్తించారు. ఇప్పుడాయనను రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా నియమించి పూర్తి స్థాయి బాధ్యతలప్పగించారు. ఉన్నత విద్యామండలి అధికారులు కొత్త కన్వీనర్ పేరును సూచించాల్సిందిగా ఓయూ వీసీ కి లేఖ రాశారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పీ చంద్రశేఖర్ సహా మరో ఇద్దరి పేర్లను ఓయూ అధికారులు ప్రతిపాదించారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని పెన్షనర్ల జేఏసీ ఆరోపించింది. తక్షణమే స్పందించి రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈహెచ్‌ఎస్ సహా మూ డు పెండింగ్ డీఏలను అమలు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించారని, కానీ ఇంత వరకు అతీగతీలేదని జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షనర్ల పెండింగ్ బిల్లులను కూడా మంజూచేయాలని, ఐఆర్‌ను 20శాతానికి పెంచాలని కోరారు.

# 'సీనియారిటీ ప్రకారం పదోన్నతులివ్వాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : సీనియారిటీ ప్రకారం తమకు పదోన్నతులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు.


